సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



అప్పన్నకు విశేషంగా తిరువీధి

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం తిరువీధి ఘనంగా జరిగింది.



నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలోమంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.



సంరక్షణ కేంద్రాలకు చిన్నారులు

మఠం పంచాయతీ గన్నేరుపుట్టులో హత్యకు గురైన మహిళకు చెందిన పిల్లలను బాల ల సంరక్షణ గృహానికి తరలిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు రేపు

మహారాణిపేట(విశాఖ): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు బుధవారం నిర్వహించనున్నట్టు జెడ్పీ సీఈవో పి.నారాయణ మూర్తి సోమవారం తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 4, 3వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12 గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు.

విస్తృతంగా తనిఖీలు



కించుమండ, బల్లుగుడ మధ్య తనిఖీ నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

డుంబ్రిగుడ: మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అరకు–పాడేరు జాతీయ రహదారిలో ప్రధాన కల్వర్టులు, నూతన వంతెనల వద్ద ఎస్‌ఐ కె.పాపినాయుడు ఆధ్వర్యంలో బాంబు స్క్వాడ్,డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు జరిపారు. అనుమానిత ప్రదేశాల వద్ద క్షుణ్ణంగా పరిశీలించారు. హెడ్‌కానిస్టేబుల్ పురందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఎస్ అధిపతిగా వెంగయ్య బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంగయ్య

రంపచోడవరం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయం పరిధిలోని పందిరమామిడిలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం అధిపతిగా డాక్టర్ పి.సి.వెంగయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన శాస్త్రవేత్తగా తాటి ఉత్పత్తులపై అనేక పరిశోధనలు చేసి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందిరిమామిడి పరిశోధన కేంద్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఉద్యాన పంటలపై సాంకేతిక సహకారం అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ లలితకామేశ్వరి పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ డాక్టర్ తనూజారాణి

సాక్షి,పాడేరు: జిల్లాలోని గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని, రోడ్లు,వంతెనల నిర్మాణాలను చేపట్టాలని కోరుతూ కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్‌కు అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి వినతిపత్రం అందజేశారు. సోమవారం కలెక్టర్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి, పలు సమస్యలపై చర్చించారు. పెదబయలు మండలంలోని మారుమూల గుంజివాడ గెడ్డపై వంతెన నిర్మాణం, మారుమూల గ్రామాల రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని,వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఎంపీ కోరారు.పార్లమెంట్ సమావేశాలు త్వరలో జరగనున్నందున ఈనెలలో అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశం ద్వారా జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, పెండింగ్ పనులు, కొత్త ప్రాజెక్టుల గురించి తెలుసుకుని పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు అవకాశం ఉంటుందని ఎంపీ తెలిపారు.అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటుకు కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్,సర్పంచ్‌లు గుమ్మా శ్యాంసుందర్,కాతరి సురేష్,నాయకులు వెంకటరావు,కోటిబాబు పాల్గొన్నారు.

గిరిజనేతరులకు ఫుల్ కిక్

జిల్లాలో అధిక మద్యం దుకాణాలను బినామీ పేర్లతో మైదాన ప్రాంతానికి చెందిన గిరిజనేతరులు చేజిక్కించుకున్నారు. కొందరు సిండికేట్‌గా మారి గిరిజనుల పేరుతో షాపులు పొందారు. లాటరీ సందర్భంగా డబ్బు సంచులతో పెద్ద ఎత్తున మైదాన ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. లాటరీ హాల్‌లో టీడీపీ నేతలు హల్‌చల్ చేశారు. షాపుల కోసం అధిక సంఖ్యలో మహిళలు దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశమైంది.

- జిల్లాలో 40 దుకాణాలకు 1,205 దరఖాస్తులు
- లాటరీ ద్వారా కేటాయింపు
- లాటరీ హాల్‌లో టీడీపీ నేతల హల్‌చల్
- పట్టించుకోని అధికారులు



మద్యం దుకాణాలకు లాటరీ తీస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా 40 మద్యం షాపులకు గానూ 1,205 దరఖాస్తులు వచ్చాయి. ఫస్ట్, సెకెండ్, థర్డ్ అని ప్రతి షాపునకు ముగ్గురు చొప్పున మొత్తం 120 మందిని ఎంపిక చేశారు. మద్యం దుకాణాలన్నీ పేరుకే గిరిజనులకే రిజర్వ్ అయినా బినామీ పేర్లతో అత్యధిక షాపులను మైదాన ప్రాంతాలకు చెందిన గిరిజనేతరులు చేజిక్కించుకున్నారు. మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించి జిల్లా కేంద్రం పాడేరులోని వి.ఆర్.పంక్షన్ హాల్‌లో కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సోమవారం ఉదయం లాటరీ తీసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.పంక్షన్ హాల్‌కు సమీపంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. దరఖాస్తుదారులైన గిరిజనులతో పాటు వారితో దరఖాస్తులు చేయించి, డీడీ సొమ్ము రూ.2లక్షలు కట్టిన గిరిజనేతరులు,మద్యం వ్యాపారులు,సిండికేట్ బృందాల సభ్యులతో వి.ఆర్.పంక్షన్ హాల్ ప్రాంతమంతా రద్దీగా మారింది. కలెక్టర్ దినేష్‌కుమార్ స్వయంగా ప్రతి దుకాణానికి లాటరీ తీశారు.ప్రథమ,ద్వితీయ,తృతీయ పద్ధతిలో క్వాయిన్స్‌ను లాటరీలో కలెక్టర్ తీశారు.లాటరీలో మొదటి ప్రాధాన్యత వ్యక్తి అర్హుడు కాకపోయిన,వెంటనే రూ.10లక్షల లైసెన్స్ ఫీజు కట్టకపోయినా తరువాత స్థానాల్లో వ్యక్తులకు మద్యం దుకాణాలు కేటాయించాలనే నిబంధనలను అధికారులు అమలుచేశారు. లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను గిరిజనులు దక్కించుకున్నప్పటికీ మద్యం వ్యాపారులు, గిరిజనేతరులదే హవాగా మారింది. 1,205 దరఖాస్తుల ద్వారా రూ.24.10 కోట్లు డీడీల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది.

చింతపల్లిలోని ఓ దుకాణం దివ్యాంగుడైన గిరిజనుడికి లభించింది. అయితే ఆ దుకాణానికి కూడా మైదాన ప్రాంత సిండికేట్ ద్వారా దరఖాస్తు చేయించినట్టు స్థానికుల ద్వారా తెలియవచ్చింది. మైదాన ప్రాంతాలకు చెందిన గిరిజనేతరులు, గతంలో మద్యం వ్యాపారం చేసిన వారు,సిండికేట్ బృందాలు డబ్బు సంచులతో వాహనాల్లో పాడేరుకు తరలివచ్చారు.వారంతా గిరిజనులతో దరఖాస్తులు చేయించిన వారే.లాటరీలో దుకాణాలు పొందిన గిరిజనులందరిని తమ ఆధీనంలోకి మద్యం వ్యాపారులు తీసుకుని రూ.10లక్షల లైసెన్స్ ఫీజును చెల్లించారని తెలిసింది.మద్యం వ్యాపారులు, సిండికేట్ బృందాలు,కొంతమంది టీడీపీ నాయకులు కూడా లాటరీగదిలో హల్‌చల్ చేసినా... వారిని ప్రశ్నించే అధికారి కరువయ్యాడు.జిల్లాలోని చింతూరు డివిజన్ పరిధిలోని దుకాణాలకు అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసిన వారికి వెనక ఉన్న తెలంగాణ మద్యం వ్యాపారులు కూడా తరలివచ్చారు. అత్యధికంగా ఎటపాకలో ఒక దుకాణానికి 70, మరో దుకాణానికి 65, కూనవరానికి 62 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా పెదబయలులోని ఒక షాపునకు ఆరు దరఖాస్తులు వచ్చాయి. లాటరీ ప్రక్రియను కలెక్టర్ దినేష్‌కుమార్,జేసీ అభిషేక్‌గౌడ,ఎక్సైజ్ సహాయ కమిషనర్ వి.మహేశ్వర్,రంపచోడవరం ఎక్సైజ్ సహాయ పర్యవేక్షకులు నాగరాహుల్ ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 40 మద్యం దుకాణాల్లో పెత్తందారులంతా గిరిజనేతరులే కావడం విశేషం.



మద్యం దుకాణాల లాటరీలో పాల్గొన్న దరఖాస్తుదారులు

లాటరీకి పిల్లాపాపలతో..

వి.ఆర్.కళ్యాణమండపంలో నిర్వహించిన లాటరీకి గిరిజన మహిళలు తరలివచ్చారు.కొంత మంది చంటి పిల్లలను కూడా ఈ లాటరీ గదిలోకి తీసుకురావడం చర్చనీయాంశమైంది. పలు దుకాణాలకు సుమారు 30మంది వరకు గిరిజన మహిళలు,యువతులు దరఖాస్తులు చేశారు. వారంతా లాటరీలో హుషారుగా పాల్గొన్నారు. అరకులోయలోని 14వ నంబర్,కొయ్యూరులో 22వ నంబర్,రంపచోడవరంలోని 24వ నంబర్,రాజవొమ్మంగిలోని 31వ నంబర్ దుకాణాలను గిరిజన మహిళలు లాటరీలో దక్కించుకున్నారు.



అడవి బిడ్డలకు సేవలందించడం అదృష్టం



మెడికల్ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- ఆహ్లాదకర వాతావరణం పాడేరు సొంతం
- వైద్య విద్యకు అనువైన ప్రాంతం
- వైద్యవిద్య తరగతుల ప్రారంభోత్సవంలో కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: గిరిజనులకు సేవలందించడం ఎంతో అదృష్టమని, వైద్య విద్యను సంపూర్ణంగా అభ్యసించి, వారికి సేవ చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. పాడేరులో నిర్మించిన వైద్య కళాశాలలో సోమవారం నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సురక్షిత ప్రాంతమని, భయాందోళనలు లేకుండా వైద్య విద్యార్థులు విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ ఏడాది నుంచే పాడేరు వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభించాలని సంకల్పించి, 50 మందికి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాలు కల్పించినట్టు చెప్పారు. కాగా 42 మంది విద్యార్థులు ప్రవేశం పొంది కళాశాలకు హాజరయ్యారు. వారితో పాటు వారి తల్లిదండ్రులను కూడా కళాశాల యాజమాన్యం ఆహ్వానించింది. వారందరితో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈఏడాది నుంచి వైద్య విద్య తరగతులు నిర్వహించాలన్న పట్టుదలతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలను మేరకు గత నెల రోజులుగా ఇంజినీరింగ్ అధికారులు ఎంతో కృషి చేసి మెడికల్ కళాశాలతో పాటు అనాటమీ, బయో–కెమిస్ట్రీ ల్యాబులు,ఇతర భవనాలను పూర్తి చేసి అందివ్వడం గొప్ప విషయమన్నారు. కొంత మంది తల్లిదండ్రులు పాడేరు అంటే వెనుకడుగు వేస్తున్నారని, ఎంటువంటి సమస్యలు లేని ప్రశాంతమైన వాతావరణంలో వైద్య విద్యకు అనువైన ప్రాంతం పాడేరు అని కలెక్టర్ తెలిపారు. 15 ఏళ్ల క్రితం వోయిస్టుల ప్రభావం ఉండేదని, ప్రస్తుతం ఆ ఇబ్బందులు లేవన్నారు. చాలా మంది దీనిని మారుమూల ప్రాంతంగా భావిస్తున్నారని, కానీ రెండు గంటల్లో విశాఖపట్నం చేరుకుని, అక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లగలమని వివరించారు. జిల్లాలో సుమారు 1,100 గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించే పనులు జరుగుతున్నాయని, త్వరలో వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు ఎటువంటి భయాందోళనలు లేకుండా వైద్య విద్యను అభ్యసించాలని కోరారు. మరో రెండు మూడు నెలల్లో అన్ని సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గిరిజనులకు సేవలందించే అవకాశం ఇక్కడ చదువుకున్న వారికి కలుగుతుందన్నారు. గిరిజనులు కూడా సంప్రదాయాలను పాటించడంతో పాటు ఉన్నత విద్యలను అభ్యసిస్తున్నారని, గిరిజనులు గౌరవప్రదంగా, మంచిగా ఉంటారని కలెక్టర్ తెలిపారు.

సంయుక్త కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ 2010లో తాను కూడా వైద్య విద్యను అభ్యసించామని తెలుపుతూ ఆనాటి అనుభవాలను వివరించారు. అన్ని వృత్తుల్లోకి వైద్యవృత్తికి ఎంతో ప్రాధాన్యత ఉంద ని, డాక్టర్ అంటే ప్రాణాలు రక్షించేవారని, అంతటి ప్రాధాన్యత ఉన్న విద్యను అభ్యసించడం గర్వంగా భావించాలన్నారు. పాడేరు కళాశాలలో ప్రారంభమైన మొదటి బ్యాచ్ రానున్న బ్యాచ్‌లకు ఆదర్శంగా, నమూనాగా నిలవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్‌వి.శ్రీనివాస్,ఏపీఎంఎస్ఐడీసీ కార్యనిర్వాహక ఇంజినీర్ డి.అచ్చంనాయుడు, గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ టి.నర్సింగ్‌రావు అన్ని విభాగాల వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో ఏపీఈపీడీసీఎల్ అప్రమత్తం

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఏ విధమైన విద్యుత్ సమస్యలు తలెత్తినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సంస్థ పరిధిలోని 11 జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలతో పాటు కోనసీమ, కాకినాడ, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఏపీఈపీడీసీఎల్ ముందస్తు ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా 11 జిల్లాల అధికారులతో సీఎండీ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, అవసరమైన యంత్రాంగం, పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఎస్ఈ, ఈఈలను ఆదేశించారు. తుఫాన్ వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు సీఎండీ వెల్లడించారు. భారీ వర్షాల ప్రభావానికి తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లపై పడిపోయిన చెట్లకొమ్మల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాటి సమాచారాన్ని కార్పొరేట్ కార్యాలయంలోని టోల్ ఫ్రీ నంబర్ 1912 లేదా కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని పృథ్వీతేజ్ ఇమ్మడి విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నం కార్పొరేట్		
కార్యాలయం	-	83310 18762
శ్రీకాకుళం	-	94906 12633
విజయనగరం	-	94906 10102
పార్వతీపురం మన్యం	-	83320 46778
విశాఖపట్నం	-	73822 49881
అనకాపల్లి	-	94906 10022
అల్లూరి సీతారామరాజు	-	94906 10026
కోనసీమ	-	94409 04477
కాకినాడ	-	94931 78718
ఏలూరు	-	94409 02926
తూర్పుగోదావరి	-	73822 99960
పశ్చిమగోదావరి	-	94906 10143

తిరుగు ప్రయాణం..ప్రత్యక్ష నరకం

దసరా పండగ సందడి ముగిసింది.. సెలవులకు సొంత ఊళ్లకు వచ్చిన వారు తిరుగు ప్రయాణమవుతున్నారు. బస్సులన్నీ కిక్కిరిసి నడుస్తున్నాయి. బస్సు ఎక్కడానికి కూడా ఖాళీ లేకుండా ఉంది. ప్రయాణికులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు.

- ముగిసిన దసరా సంబరాలు
- ఊళ్లకు పయనమైన జనం
- కిటకిటలాడిన పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్
- విశాఖ వెళ్లే బస్సుల్లో విపరీతమైన రద్దీ



ప్రయాణికులతో రద్దీగా ఉన్న పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్



విశాఖ వెళ్లే బస్సుల్లో సీట్ల కోసం అవస్థలు పడుతున్న ప్రయాణికులు

సాక్షి, పాడేరు: ఏ పండగ వచ్చిన ఏజెన్సీలో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. మైదాన ప్రాంతాల్లోని ప్రయాణికులకు పండగల సమయంలో ప్రత్యేక బస్సులు నడుపుతూ గిరిజన ప్రాంతాలను పూర్తిగా విస్మరిస్తుండడంపై మన్యం ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దసరా పండగ సెలవుల సమయంలోను ఏజెన్సీకి అదనంగా బస్సులు నడపక పోవడంతో ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. దసరా సెలవులు ముగియడంతో విద్యార్థులు,ఇతర ప్రయాణికులు ఊళ్లకు చేరుకోడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తిరుగుప్రయాణికులతో సోమవారం పాడేరు,అరకులోయ, చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో తీవ్ర రద్దీ నెలకొంది. సరిపడినన్ని బస్సులు నడపకపోవడంతో అరకులోయ నుంచి పాడేరు,విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. చింతపల్లి నుంచి నర్సీపట్నం,విశాఖపట్నం వెళ్లే బస్సులకు డిమాండ్ ఏర్పడింది.పాడేరు నుంచి ఏజెన్సీలోని పలు ప్రాంతాలకు రెగ్యులర్ సర్వీసులు తప్ప అదనంగా బస్సులు నడపకపోవడంతో చాలా మంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. పాడేరు నుంచి చోడవరం,విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లే బస్సుల సంఖ్య పెంచకపోవడంతోఈరూట్‌లో ప్రయాణించిన విద్యార్థులు,ఉద్యోగుల కుటుంబ సభ్యులు,వివిధ వర్గాల ప్రయాణికులు నరకాన్ని చవిచూశారు.పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణికులతో కిటకిటలాడింది. విశాఖ వైపు నడిచిన బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. బస్సులో సీట్ల కోసం ప్రయాణికులు ప్రమాదకర పరిస్థితులలో పరుగులు పెట్టారు.మరో మూడు రోజుల వరకు రద్దీ ఉంటుందని, విశాఖ,నర్సీపట్నం,పాడేరు,ఎస్.కోట డిపోల అధికారులు ఏజెన్సీకి అదనంగా బస్‌లు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.

కాఫీ సేకరణ ధరల పెంపు



చర్చిస్తున్న జీసీసీ ఎండీ కల్పనాకుమారి, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, అధికారులు

మహారాణిపేట(విశాఖ): గిరిజనుల వద్ద నుంచి సేకరిస్తున్న కాఫీ కొనుగోలు ధరల పెంపునకు గిరిజన సహకార సంస్థ(జీసీసీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2024–25 సంవత్సరానికి కాఫీ సేకరణ ధరలను నిర్ణయించేందుకు సోమవారం జీసీసీ కేంద్ర కార్యాలయంలో అపెక్స్ కమిటీ సమావేశమైంది. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి, ఐటీడీఏ పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, కాఫీ బోర్డు ఆఫ్ ఇండియా(బెంగళూరు) డాక్టర్ డి.ఆర్.బాబు రెడ్డి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఇతర అధికారులు పాల్గొన్నారు. గత సంవత్సరం కాఫీ సేకరణ ధరలు అరెబికా పార్చ్‌మెంట్ రకానికి కిలో రూ.280, అరెబికా చెర్రి రకానికి రూ.145, రోబస్టా చెర్రి కాఫీ రకానికి రూ.70 చొప్పున ఉండేవి. అంతర్జాతీయ కాఫీ ధరలను దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం కాఫీ సేకరణ ధరలను అరెబికా పార్చ్‌మెంట్ రకానికి రూ.285, అరెబికా చెర్రి రకానికి రూ.150, రోబస్టా చెర్రి కాఫీ రకానికి రూ.80 చొప్పున నిర్ణయించారు. ఈ సందర్భంగా జీసీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి మాట్లాడుతూ గిరిజన కాఫీ రైతుల సంక్షేమం కోసం ధరలు పెంచినట్లు తెలిపారు. పెంచిన కాఫీ సేకరణ ధరలపై పాడేరు ఏజెన్సీలోని గిరిజన కాఫీ రైతులందరికి విస్తృత అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రకటించిన కాఫీ ధరల కంటే తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని కాఫీ రైతులకు ఎండీ విజ్ఞప్తి చేశారు. కాఫీ సేకరణకు సంబంధించి ఏజెన్సీలోని మారుమూల పల్లె ప్రాంతాలకు కూడా జీసీసీ సిబ్బంది వెళ్లి.. రైతు ఇంటి ముంగిటనే ఎలక్ట్రానిక్ కాటా ద్వారా కచ్చితమైన తూకంతో సేకరించాలన్నారు. కాఫీ సేకరణకు సంబంధించి నగదును రైతు బ్యాంకు ఖాతాలోకి నేరుగా 24 గంటల్లోగా జమ చేస్తామన్నారు. గత సంవత్సరం 565 మెట్రిక్ టన్నుల కాఫీని గిరిజన రైతుల నుంచి సేకరించగా, ఈ సంవత్సరం 2000 మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. జీసీసీ జనరల్ మేనేజర్(కాఫీ) ఎంవీపీఎస్ ఉమాదేవి పాల్గొన్నారు.

సొంత ఊరికి కొంత మేలు

జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర



లబ్బూరులో దుస్తులు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: సొంత ఊరికి ఎంతోకొంత మేలు చేయాలని, దాతృత్వాన్ని కలిగి ఉండాలని జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు.మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరులో సోమవారం వృద్ధులు,వింతులు,పేదలకు జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైఎస్సార్‌సీపీ నేతలు చీరలు,రగ్గులు,లుంగీలు,తువ్వాళ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత ఊరి ప్రజలకు అన్ని విధాలుగా సహాయ పడాలన్నారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తానని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, మండల నేతలు మూర్తి,జయదేవ్‌లు పాల్గొన్నారు.

డోలీలో మోసుకెళ్లినా.. దక్కని ప్రాణం

తీవ్రమైన కడుపు నొప్పితో గిరిజనుడి మృతి



డోలీపై వాగులోంచి తమ్మిరెడ్డిని మోసుకొస్తున్న గ్రామస్తులు, బంధువులు

మారేడుమిల్లి: తీవ్ర అనారోగ్యానికి గురైన ఓ గిరిజనుడిని చికిత్స కోసం డోలీలో ఎనిమిది కిలోమీటర్లు మోసుకుంటూ తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించడంతో మార్గమధ్యంలో మృతిచెందాడు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సున్నంపాడు పంచాయతీ పరిధిలోని నూరుపూడి గ్రామానికి చెందిన కేచ్చల తమ్మిరెడ్డికి (35) సోమవారం ఉదయం తీవ్రమైన కడుపు నొప్పి వచ్చింది. నడవలేని స్థితికి చేరుకున్నాడు. ఆ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేదు. దారి చాలా అధ్వానంగా ఉంది. మార్గ మధ్యంలో పెద్ద కొండ కాలువ అడ్డుగా ఉంది. గ్రామానికి అంబులెన్స్ వచ్చే మార్గం కూడా లేదు. ప్రధాన రహదారికి రావాలంటే నూరుపూడి నుంచి ఎనిమిది కిలోమీటర్లు నడిచి సున్నంపాడు గ్రామానికి రావాలి. చేసేది లేక బంధువులు, గ్రామస్తులు డోలీలో తమ్మిరెడ్డిని మోసుకుంటూ అతికష్టం మీద సున్నంపాడు గ్రామానికి తీసుకువస్తుండగా సమీపానికి వచ్చే సరికి కడుపు నొప్పి అధికం కావడంతో పరిస్థితి విషమించి చెందాడు. సుమారు ఎనిమిది కిలోమీటర్లు మేర డోలి పైనే గ్రామస్తులు, బంధువులు తమ్మిరెడ్డిని మోసుకొచ్చారు. రహదారి సౌకర్యం లేకపోవడం, వాగుపై వంతెన లేక డోలీపై మోసేందుకు సమయం పట్టడంతో బాధను తట్టుకోలేక తమ్మిరెడ్డి చెందాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



'సన్'దర్శకుల సందడి -8లో

ప్రకృతి మ'హిమ'


పాడేరు పట్టణంలోని మంచు అందాలు

జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం వేకువజామున మంచు దట్టంగా కురిసింది. మంచు అందాలు పర్యాటకులను, స్థానికులను కనువిందు చేశాయి. పాడేరు చుట్టూ ఉన్న కొండలను మంచు తాకిన దృశ్యాలు అబ్బురపరిచాయి. దీంతో పాటు హరివిల్లును ప్రకృతి సోయగాలను తిలకించి మైమరిచిపోయారు. - సాక్షి,పాడేరు


పాడేరులో కనువిందు చేస్తున్న హరివిల్లు

'సన్'దర్శకుల సందడి



ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలోని మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్‌లో సోమవారం వేకువజామున సందర్శకులు సందడి చేశారు. ఇక్కడకు వచ్చిన టూరిస్టులు సూర్యోదయం సోయగాలు, ప్రకృతి అందాలను తిలకిస్తూ మంచు తెమ్మెరల గిలిగింతలను ఆస్వాదిస్తూ ఆనందపరవశులయ్యారు. గిరి మహిళలతో పాటు థింసా నృత్యం చేస్తూ సంతోషంగా గడిపారు.
- అరకులోయ రూరల్


థింసా నృత్యం చేస్తున్న పర్యాటకులు

డీఎస్సీ శిక్షణ సంస్థల నమోదుకు దరఖాస్తులు

తుమ్మపాల: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇవ్వడం కోసం శిక్షణ సంస్థల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఇన్‌చార్జి జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కె.రాజేశ్వరి తెలిపారు. రాష్ట్రంలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా 5,050 ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారన్నారు. దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు కనీసం రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలని, గత డీఎస్సీలో కనీసం 100 మంది ఉద్యోగాలు పొంది ఉండాలని, మూడు సంవత్సరాల సరాసరి టర్నోవర్ రూ.40 లక్షలు ఉండాలని తెలిపా రు. ఆసక్తి ఉన్న శిక్షణ సంస్థలు ఇతర వివరాల కోసం డాక్యుమెంట్‌ను https://apeprocurement. gov. in/ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, ఈ నెల 21వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు.

సంరక్షణ కేంద్రాలకు అనాథ చిన్నారులు

హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ గన్నేరుపుట్టు గ్రామంలో ఆదివారం భర్త చేతిలో హత్యకు గురై మృతి చెందిన మహిళ లబ్బుకు చెందిన ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. ఆయా చిన్నారులు శ్రావణి, బాబు పవన్‌లను ప్రభుత్వ బాలల సంరక్షణ గృహానికి తరలిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్రమణి దేవి చెప్పారు. ఆమె సోమవారం గన్నేరుపుట్టు గ్రామాన్ని సందర్శించారు. ఈ నేపథ్యంలో స్థానిక సర్పంచ్, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భార్యను హత్య చేసిన భర్త పనో పోలీసు కస్టడీకి వెళ్లగా చిన్నారులు పాప శ్రావణి(3) బాబు పవన్(1) అనాథులుగా మిగిలిరాన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిని ప్రభుత్వ బాలల సంరక్షణ గృహాలకు తరలిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్ మఠం శాంతికుమారి, వార్డు సభ్యుడు మత్యకొండబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: గిరిజనుల సమస్యలపై సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఐటీడీఏ సమావేశం హాలులో సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.మారేడుమిల్లి మండలం తాడేపల్లి నుంచి నూరుపూడి, సున్నంపాడు గ్రామానికి రోడ్డు నిర్మించాలని గిరిజనులు నైని మల్లేశ్వరరెడ్డి, కత్తుల ధర్మారెడ్డి, లచ్చిరెడ్డిలు కోరారు. 24 సంవత్సరాల వయస్సు గల తన కుమార్తె కృష్ణవేణి తప్పిపోయిందని ఆచూకీ తెలుసుకునేందుకు చర్యలు తీసుకోవాలని రంపచోడవరం మండలం చిన్నబీరంపల్లి గ్రామానికి చెందిన మలగల అత్యాయమ్మ కోరారు. కాకినాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బడిగుంట గ్రామానికి రోడ్డు నిర్మించాలని ఆ గ్రామస్తులు కోరారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి, ప్రభుత్వం పెంచిన పింఛను పథకం అమలు చేయాలని మనోవికాసం కేంద్రం ప్రతినిధులు కమల,రాణి, లూదియాలు అర్జీ అందజేశారు.డీడీ విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న పీవో, సబ్ కలెక్టర్‌లు

ముగిసిన నృత్యోత్సవాలు


పసుపర్తికి వెంపటి చినసత్యం జీవ సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న సెంచూరియన్ ఉపకులపతి జీఎస్ఎన్ రాజు తదితరులు

మద్దిలపాలెం(విశాఖ): విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్, కూచిపూడి కళాక్షేత్ర సంయుక్తంగా నిర్వహిస్తున్న వెంపటి చిన్న సత్యం జయంతి నృత్యోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిసాయి. కళాభారతి ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నాట్య గురువులు పసుమర్తి వెంకటేశ్వర శర్మకు వెంపటి చిన సత్యం జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు.

సెంచూరియన్ యూనివర్సిటీ కులపతి జి.ఎస్.ఎన్.రాజు, జిల్లా పర్యాటకశాఖాధికారి జ్ఞానవేణి, కళారత్న సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత బాలకొండలరావు చేతులమీదుగా ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శలు అందరినీ అలరించాయి. విజయ నిర్మాణ్ అధినేత సురపనేని విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- బైకిస్టు మృతి
- మృతుడు ఏలూరు జిల్లా వాసి

ఎటపాక: ఎటపాక మండలం గన్నవరం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఏలూరు జిల్లా వెలేరుపాడు మండలం రుద్రమకోట గ్రామానికి చెందిన గాదె అనిల్(37) భద్రాచలంలో తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటూ ఫెర్టిలైజర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. దసరా పండగకు స్వగ్రామం రుద్రమకోట కుటుంబంతో కలిసి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం భార్య, ఇద్దరు పిల్లలను బస్సులో భద్రాచలం పంపించి తన ద్విచక్ర వాహనం బోటుపై గోదావరి నది దాటించి కూనవరం నుంచి భద్రాచలం వస్తున్నాడు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లను తీసుకువస్తున్న వ్యాన్‌ను గన్నవరం సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనిల్ తల నుజ్జు నుజ్జు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద ఘటన సమాచారం తెలుసుకుని మృతుడి బంధువులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఎస్ఐ పార్థసారథి ప్రమాద వివరాలు సేకరించి మృతదేహాన్ని భద్రాచలం తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు అనిల్‌కు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.


ప్రమాదంలో మృతి చెందిన అనిల్

విహార యాత్రకు వెళ్లిన విద్యార్థి అదృశ్యం

- ఒడిశాలో సంఘటన
- రెండు రోజులుగా గాలిస్తున్నా.. కానరాని ఆచూకీ


సాత్విక్

అగనంపూడి: విహారయాత్రకు వెళ్లి నదిలో కొట్టుకుపోయిన విద్యార్థి కోసం ఒడిశా పోలీసులు గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అగనంపూడి నిర్వాసిత కాలనీ కొండయ్యవలసకు చెందిన రచయిత కంచిపాటి నరసింహమూర్తి తన కుమారుడు సాత్విక్ (18) గాజువాకలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులకు సాత్విక్‌తోపాటు ఆమె సోదరి మౌని ఒడిశాలోకి సుందర్‌ఘర్ ఎన్టీపీసీలో పనిచేస్తున్న తన మేనమామ ఇంటికి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం అక్కడ ఉన్న ఐదు కుటుంబాలకు చెందిన 18 మంది బలిశంకర్ బ్లాక్ పరిధిలోని ఘొగర్ కునకుంద నదికి విహార యాత్రకు వెళ్లారు. స్నానం చేస్తుండగా నీటి ఉధృతికి సాత్విక్ గల్లంతయ్యాడు. తలసారా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి వరకు ఆచూకీ లభ్యం కాకపోవడంతో అగనంపూడిలోని బాలుడి తల్లిదండ్రులు, బంధువులు తల్లడిల్లుతున్నారు.

హెల్త్ సెక్రటరీలపై తీవ్ర పని ఒత్తిడి

'ఉషా'గౌరవ అధ్యక్షురాలు మణి


సీతమ్మధార: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న హెల్త్ సెక్రటరీలకు ఎంపీహెచ్ఏలుగా పదోన్నతులివ్వాలని ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ విలేజ్/వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఉషా) గౌరవ అధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో సోమవారం నిర్వహించిన హెల్త్ సెక్రటరీల ధర్నాలో ఆమె మాట్లాడారు. హెల్త్ సెక్రటరీలను వైద్య–ఆరోగ్యశాఖ పరిధిలోకి పూర్తి స్థాయిలో తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వీరంతా జీవీఎంసీ, ఎంపీడీవో, డీఎంహెచ్‌వో పరిధిలో ఉన్న కారణంగా తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా వివిధ రకాలుగా ఆందోళన చేస్తున్నా.. ఫలితం లేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. పలు జిల్లాల్లో వివిధ శాఖలు అదనపు పనులు అప్పగించడం అన్యాయమన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు అయిన హెల్త్ సెక్రటరీలకు సెలవులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. దాదాపుగా 60కి పైగా యాప్‌ల కారణంగా పని ఒత్తిడితో మానసిక ప్రశాంతత ఉండటం లేదన్నారు. వ్యాక్సిన్, క్యారియర్ రవాణా భత్యం ఇవ్వాలని, యూనిఫాం అలవెన్సు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విలేజ్ క్లినిక్‌లను సబ్ సెంటర్లుగా మార్చే అంశాలను పరిశీలించాని కోరారు. ఆదివారాలు, పండగ రోజుల్లో డ్యూటీలు వేయవద్దన్నారు. ధర్నాలో అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు జి.కల్యాణి, అధ్యక్షురాలు ఎస్.సుభాషిణి, కార్యనిర్వాహక కార్యదర్శి జి.సంధ్యారాణి, పి.రాజ్యలక్ష్మి, జి.లక్ష్మి, ఎస్.భాగ్యలక్ష్మి, ఆర్.సరోజిని, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షురాలు మణి

17 నుంచి నరాల వ్యాధులపై జాతీయ సదస్సు

మహారాణిపేట: నరాలకు సంబంధించిన వ్యాధులపై ఈ నెల 17 నుంచి నగరంలో నాలుగు రోజుల పాటు జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ గోపి తెలిపారు. కేజీహెచ్ న్యూరాలజీ విభాగంలో సోమవారం డాక్టర్ బుచ్చిరాజు మీడియాతో మాట్లాడారు. సదస్సులో భాగంగా నరాలకు సంబంధించిన అనేక వ్యాధుల మీద చర్చ జరుగుతుందని, దేశ, విదేశాల నుంచి దాదాపు రెండు వేల మంది వైద్యులు పాల్గొంటారని తెలిపారు. 17న న్యూరాలజీలో నిరంతరం వైద్య విద్యా(సీఎంఈ) కార్యక్రమాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రారంభిస్తారన్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు 31వ జాతీయ సదస్సుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు హాజరై ప్రసంగిస్తారని చెప్పారు. పలు అంశాలపై ప్రముఖ న్యూరాలజిస్టులు ప్రసంగాలు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ గోపి తెలిపారు. ఈ నెల 20న ఉదయం 6 గంటలకు రన్ ఫర్ బ్రెయిన్ పేరిట 10కె మారథాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో న్యూరాలజీ వైద్యులు సతీష్, కిశోర్ బాబు, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ మృతి


రాజారావు(ఫైల్)

చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఆర్ఐటీఐ) ప్రిన్సిపాల్ రాజారావు (57) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వస్థలం విశాఖలోని వేపగుంట. ఆయన చింతపల్లి సమీపంలోని పెంటపాడు ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఇంటి వద్ద ఉన్న ఆయన అస్వస్థతకు గురై హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. రాజారావు మృతికి సహచర సిబ్బంది, విద్యార్థులు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కేజీబీవీ ఉద్యోగాల్లో పీహెచ్ అభ్యర్థులకు అవకాశం

మురళీనగర్(విశాఖ): కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) బోధనేతర పోస్టుల నియామకంలో శారీరక వైకల్యం అభ్యర్థులకు అవకాశాన్ని కల్పిస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టరు ఉత్తర్వులు జారీ చేశారని ఆంధ్రప్రదేశ్ వికలాంగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. తమ సంఘం అభ్యర్థన మేరకు ఈ అవకాశాన్ని కల్పిస్తూ ఎస్పీడీ ఉత్తర్వులు జారీ చేశారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత సవరణలు ప్రకారం దివ్యాంగులకు అన్ని పోస్టుల్లోనూ సమాన అవకాశాలు కల్పించినట్లవుతుందన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అపోలోలో ఛాతీనొప్పి క్లినిక్ ప్రారంభం

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని అపోలోలో ఆస్పత్రిలో ఛాతీనొప్పి క్లినిక్‌ను సోమవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండె సమస్యలను ప్రారంభ దశలో తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత యువత ఎక్కువగా గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుండె నొప్పిపై సందేహం ఉన్న వారికి ఈ క్లినిక్ ఉపయోగపడుతుందన్నారు. గుండె వ్యాధులపై పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో అన్ని చోట్లా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పోలీసులకు ఈ క్లినిక్‌లో గుండె నొప్పి పరీక్షలు నిర్వహించాలని ఆమె సూచించారు. అపోలో రీజినల్ సీఈవో వై.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ హెల్త్‌సిటీ అపోలో, రాంనగర్ అపోలోలో ఛాతీనొప్పి క్లినిక్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆస్పత్రి సీవోవో రామచంద్రారావు, వైద్యులు ప్రాణిగ్రహి, శశాంక్, చక్రధర్, రవికాంత్, త్రివేది, విజయ్, బాలకృష్ణ పాల్గొన్నారు.


చెస్ట్ పెయిన్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

'రైవాడ' మరమ్మతులకు రూ. 3.06 కోట్లు మంజూరు

దేవరాపల్లి: రైవాడ జలాశయం పరిధిలో మెయింటెనెన్స్ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి రూ. 3.06 కోట్లు మంజూరయ్యాయని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పిల్వే గేట్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పనులు, జలాశయం గట్టుపై రహదారి అభివృద్ధితో పాటు దేవరాపల్లి మండలంలో బలహీనంగా ఉన్న సాగునీటి కాలువల అభివృద్ధికి రూ. 2.67 కోట్లు మంజూరయ్యాయన్నారు. కె.కోటపాడు మండల పరిధిలో దెబ్బతిన్న సాగునీటి కాలువలను పటిష్టం చేసేందుకు రూ. 39.47 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులకు సంబంధించి పరిపాలన ఆమోదం లభించిందన్నారు. సాంకేతిక ఆమోదం పొందిన తర్వాత టెండర్ ప్రక్రియ చేపడతారన్నారు.

బస్సు ఢీకొట్టడంతో బైకిస్ట్ మృతి

కె.కోటపాడు: మండలంలోని గుల్లేపల్లి కూడలి వద్ద సోమవారం తెల్లవారుజామున లారస్ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకిస్ట్ పసుపులేటి ఈశ్వరరావు(45) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. చోడవరం మండలం రాయపురాజుపేటకు చెందిన ఈశ్వరరావు తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంపై ఇంటి వద్ద నుంచి కె.కోటపాడు వైపు బయలుదేరాడు. అదే సమయంలో లారస్ కంపెనీకి ఉద్యోగులను తీసుకెళ్లేందుకు అనకాపల్లి వైపు బస్సు వస్తోంది. ఈ క్రమంలో గుల్లేపల్లి కూడలి వద్ద ఎదురెదురుగా వస్తూ ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొంది. ఈ ఘటనలో బైకిస్ట్ ఈశ్వరరావు తలకు తీవ్ర గాయమై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.కోటపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదరికం నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా..

- కర్ణాటక యూనివర్సిటీకి రమేష్‌బాబు నియామకం
- స్వగ్రామం రామచంద్రపాలెంలో హర్షాతిరేకాలు


రమేష్‌బాబు

కోటవురట్ల: కృషి, పట్టుదల ఉంటే పేదరికం అడ్డురాదని నిరూపించారు డాక్టర్ రమేష్‌బాబు తమరాన.. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ రైతు బిడ్డగా కన్నవారికే కాకుండా పుట్టిన ఊరికి పేరు తెచ్చిపెట్టారు. మండలంలోని రామచంద్రపాలేనికి చెందిన ఆయన కర్ణాటక యూనివర్సిటీకి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. సీయూకే మానసిక శాస్త్ర విభాగంలో నియమిస్తూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ 73వ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని, ఈ నెల 14న విధుల్లో చేరానని ఈ సందర్భంగా రమేష్‌బాబు తెలిపారు. ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించిన యూనివర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి కట్టుబడి విద్యార్థుల్లో బుద్ధి వికాసానికి, యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

చదువంతా సర్కారు బడుల్లోనే...

రామచంద్రపాలేనికి చెందిన తమరాన రామ్మూర్తి, సత్యవతి దంపతుల కుమారుడు డాక్టర్ రమేష్‌బాబుకు చదువంటే చిన్నతనం నుంచి మక్కువ. పేద కుటుంబానికి చెందిన ఆయన చదువంతా సర్కారు బడుల్లోనే సాగింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇంటర్, డిగ్రీ నర్సీపట్నం ప్రభుత్వ కళాశాలల్లోనూ పూర్తి చేశారు. బీఎడ్ డి.యర్రవరంలోను, ఎంఈడీ భీమవరంలోనూ పూర్తి చేశారు. పుదుచ్చేరి పాండిచ్చేరి అనువర్తిత కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అనువర్తిత మనో విజ్ఞాన శాస్త్రంలో ఎంఎస్సీ, అక్కడే పీహెచ్‌డీ కూడా పూర్తి చేశారు. అదే యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకునిగా పనిచేశారు. 2018–2019లో శ్రీపెరంబదూర్‌లోని రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 2019 నుంచి ఇప్పటి వరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీ, క్రైస్ట్ (డీమ్డ్ టు ద యూనివర్సిటీ), బెంగళూరులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అక్కడి నుంచి సీయూకేలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ఆయనకు బి.కె.పల్లి ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు, గ్రామస్తులు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.